## బ్రిడ్జి పనులు ప్రారంభం

### 'నమస్తే' కథనానికి స్పందన



పనులను ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్

నయీంనగర్, ఆగస్టు 22 : ప్రజలకు ఇబ్బందులు లేకుండా గోపాలపురం జవహర్‌కాలనీ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం 'అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల నరకయాతన' అనే వార్త 'నమస్తే'లో ప్రచురితం అయిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం వాహనాలు పోయే విధంగా బ్రిడ్జికి అడ్డంగా పోసిన మట్టిని కొంత మేర తొలగించారు.

## గంజాయిని తరిమికొడుదాం : సీపీ

సుబేదారి, ఆగస్టు 22 : సమష్టిగా గంజాయిని తరిమికొడుదామని సీపీ అంబర్ కిశోర్ ఝా పిలునిచ్చారు. కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ కంట్రోల్ టీం పనితీరుపై సీపీ గురువారం ప్రకటన విడుదల చేశారు. గంజాయి విక్రయించినా, సేవించినా వెంటనే 8712584473 ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. కంట్రోల్ టీం నెల రోజుల్లో 14 కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు.

## సబ్‌స్టేషన్లను తనిఖీ చేయాలి : ఎన్పీడీసీఎల్ సీఎండీ

హనుమకొండ, ఆగస్టు 22 : సబ్‌స్టేషన్లను తరచుగా ప్రొటెక్షన్ టీం తనిఖీలు చేసి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సంస్థ సీఎండీ డైరెక్టర్లు, నోడల్ ఆఫీసర్లు, అన్ని జిల్లాలకు సంబంధించిన అధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని, వీసీబీలనూ పెట్టాలన్నారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని కోరారు. లోడ్ ఎక్కువ ఉన్నచోట కెపాసిటర్లను పెట్టాలన్నారు. ఎస్పీఎం షెడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్లు (హెచ్ఆర్డీ) అశోక్ కుమార్, (ఆపరేషన్) మధుసూదన్, సీజీఎంలు కిషన్, అశోక్, జీఎం అన్నపూర్ణ, డీఈలు ఉపేందర్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## 'కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థల కోసమే'

### బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు ■ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా

హనుమకొండ, ఆగస్టు 22 : లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ఓటర్లు తీర్పు ఇచ్చారని, త్వరలో జరుగనున్న హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో మళ్లీ ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా పేర్కొన్నారు. హనుమకొండలోని మూడు రోజుల పాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ మద్దతు ఎన్ని రోజులు ఇస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులను బ్యూరోక్రసీలో చొప్పించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. ఒకే దేశం.. ఒకే ఎలక్షన్, ఒకే రిలీజియన్ అనే నినాదంతో దేశంలో విచ్ఛిన్న పాలన సాగించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయడం పెద్ద వైఫల్యమని, అక్కడ ఎన్‌కౌంటర్లు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు విధేయతను చాటుకుందని, ప్రజల తక్షణ సమస్యల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. అదానీ సంస్థలో భాగస్వామ్యం కలిగిన సెబీ చైర్‌పర్సన్ ఆ పదవి నుంచి తప్పుకోవాలని ప్రధాని మోదీ ఎందుకు కోరడం లేదని, ఈ మొత్తం వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసేందుకు మోదీ ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన అత్యంత దారుణమైన నేరమన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా సాగాలన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా సంక్షోభాల నుంచి బయట పడలేకపోతున్నదన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నిట్‌లో 'వీణ వందన' సంగీత కార్యక్రమం

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 22 : వరంగల్ నిట్‌లో భారతీయ శాస్త్రీయ సంగీతం గొప్ప వారసత్వాన్ని ప్రదర్శించే 'వీణ వందన' పేరుతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. వీణ విద్వాంసుడు శ్రీనివాస్, మృదంగం కళాకారుడు రామకృష్ణ, వయోలిన్ విద్వాంసుడు పవన్‌సింగ్ ప్రదర్శన ఇచ్చారు. నిట్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వీణ, మృదంగం, వయోలిన్ మధ్య శాస్త్రీయ సంగీతం సారాంశంతో ప్రతిధ్వనించే సింఫొనీని సృష్టించింది.

## కాళేశ్వరం రూట్‌లో సెమీ డీలక్స్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 22 : వరంగల్ రీజియన్‌లో నూతనంగా సెమీ డీలక్స్ బస్సులను ఏటూరునాగారం, భూపాలపల్లి, కాళేశ్వరం రూట్లలో నడపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం విజయభాను తెలిపారు. బస్సు కిలోమీటర్‌కు చార్జి డీలక్స బస్సు రూ.1.44, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1.26, సెమీ డీలక్స్ రూ.1.37గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీడీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీడీలక్స్ రూ.110, డీలక్స్ రూ.120, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీడీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190గా నిర్ణయించినట్లు తెలిపారు.

## వినియోగదారులకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యం

న్యూశాయంపేట, ఆగస్టు 22 : వినియోగదారులకు ఉత్తమమైన సేవలందించడమే లక్ష్యమని భారత టెలికాం ప్రాధికార సంస్థ ట్రాయ్ సభ్యుడు రావూరి ప్రభాకరరావు అన్నారు. కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.



























